క్లుప్తంగా...

12 నుంచి చెరువుల క్లీనింగ్

మణికొండ: చెరువులను పరిరక్షించుకుంటేనే మనకు అవసరమైన జలసిరులు పెరుగుతాయని, చెరువుల పరిసరాలలో ఉండే చెత్తా చెదారం, ప్లాస్టిక్ వస్తువులను తొలగించి పరిశుభ్రంగా ఉంచే కార్యక్రమాలను ఈనెల 12 నుంచి చేపడుతున్నామని దవాన్ష్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి మధులిక చౌదరి తెలిపారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ముప్కి చెరువు వద్ద ఈనెల 12న ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ప్లాస్టిక్ తొలగించే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. 13న నెక్నాంపూర్ చెరువు వద్ద తమ గృహాల్లోని ప్లాస్టిక్, పనికి రాని వస్తువులను అప్పగించి బహుమతులు గెలుచుకునే కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. బహుమతుల ప్రదానోత్సవానికి ప్రగతి రిసార్ట్స్ చైర్మన్ డాక్టర్ జీబీకే రావు హాజరవుతారన్నారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని ఉత్సాహవంతులు ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆమె కోరారు.

తహసీల్దార్‌కు సన్మానం



సన్మానిస్తున్న చంద్రారెడ్డి

శంషాబాద్: శంషాబాద్ తహసీల్దార్ బాధ్యతలు స్వీకరించిన నాగమణిని గురువారం మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నీరటి రాజు ముదిరాజ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దండు ఇస్తారి, సీనియర్ నాయకుడు రవినాయక్, ప్రధాన కార్యదర్శిమంచర్ల మోహన్‌రావు, నాయకులు లాల్‌సింగ్, శ్రీకాంత్, జుర్కి రమేష్, వెంకట్‌రెడ్డి, రమేష్, మల్లికార్జున్, ఈశ్వర్ పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న సాయి మల్లిక్

రాజేంద్రనగర్: బుద్వేల్ బన్సీలాల్‌నగర్ ప్రాంతానికి చెందిన శ్రీనివాస సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం అనాథాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా సమితి వ్యవస్థాపకుడు సాయి మల్లిక్ మాట్లాడుతూ... ప్రతి నెలా సేవా సమితి ఆధ్వర్యంలో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నలుగురికి ఉపయోగపడేలా సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు.కార్యక్రమంలో సమితి సభ్యులు బాలు, సాయికిరణ్, సాయినాథ్, రాహుల్, దినేశ్ పాల్గొన్నారు.

సునీల్ బన్సల్‌కు బీజేపీ నేతల స్వాగతం



బన్సల్‌కు స్వాగతం పలికిన బైతి శ్రీధర్

శంషాబాద్: వరంగల్ పర్యటన కోసం హైదరాబాద్‌కు విచ్చేసిన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్‌కు బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్ గురువారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించారు. పార్టీ పటిష్టతో పాటు ఎన్నికలకు సిద్ధం కావాలని ఈ సందర్భంగా బన్సల్ నేతలకు సూచించారు.

రుణాల మంజూరుకు దరఖాస్తుల ఆహ్వానం

హఫీజ్‌పేట్ : పీఎం స్వాన్ నిధి పథకం కింద చందానగర్ సర్కిల్ 21 పరిధిలోని స్ట్రీట్ వెండర్లకు బ్యాంకు రుణాలను అందిస్తున్నట్లు చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్ వంశీకృష్ణ, పీఓ ఉషారాణిలు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఎం స్వాన్ నిధి పథకం కింద సర్కిల్ పరిధిలోని స్ట్రీట్ వెండింగ్ గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నెంబర్, బ్యాంకు పాసు పుస్తకం, ఓటరు గుర్తింపు కార్డు జిరాక్స్ పత్రాలతో సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ పథకాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

13న బాల బృందావనం

రాయదుర్గం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం బాలబృందావనం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 'ది స్టోరీ ఆఫ్ రియల్ ఇండిపెండెన్స్' అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23001234లో సంప్రదించవచ్చు.

- బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో జోరుగా హరితహారం
- గతేడాది 2.79 లక్షల మొక్కల పంపిణీ
- ఈ ఏడాది నాటేందుకు 2.40 లక్షల మొక్కలు సిద్ధం



పంపిణీ చేసేందుకు తీసుకెళ్తున్న మొక్కలు



మైత్రి కాలనీలోని నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు

పచ్చదనం.. ఆహ్లాదకర వాతావరణం!

బండ్లగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా హరితహారం కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. కార్పొరేషన్ పరిధిలో హరితహారంలో భాగంగా పచ్చదనం పెంచడానికి చేపట్టిన నర్సరీల పెంప కం సత్ఫలితాలను ఇస్తోంది. నర్సరీల్లో పెంచిన మొక్కలు ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఏపుగా పెరిగి నాటేందుకు, పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయి.

- గండిపేట మండలం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ గతంలో ఉన్న బండ్లగూడ జాగీర్, హియాత్‌సాగర్, కిస్మత్‌పూర్, హైదర్షాకోట్, పీరంచెరువు గ్రామ పంచాయతీలను కలిపి మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేశారు. కార్పొరేషన్ పరిధిలో ఖాళీగా ఉన్న పార్కులు, ప్రభుత్వ స్థలాలు చెరువు, కుంట గట్లపై ఉన్న ఖాళీ స్థలాలు, ప్రభుత్వ పాఠశాలలు, పట్టణ ప్రకృతి వనాలు, పలు కాలనీలలోని రోడ్ల పక్కన, ప్రధాన రహదారి పొడవునా మొక్కలు నాటేందుకు అనువైన స్థలాలను గుర్తించి అక్కడ మొక్కలు నాటుతున్నారు.

గతేడాది 2.79 లక్షల మొక్కలు..

గతేడాది నాటిన మొక్కలు ఇప్పుడు పచ్చదనంతో ఆహ్లాదకర వాతావరణాన్ని ప్రజలకు అందిస్తున్నాయి. పట్టణ ప్రకృతి నర్సరీలలో 2.79 లక్షల మొక్కలు పెంచి పలు కాలనీల్లో పంపిణీ చేశారు. మరికొన్ని ఖాళీ ప్రదేశాల్లో నాటారు.

ఈ ఏడాది 2.40 లక్షల మొక్కలు..

ఈ సంవత్సరంలో ఏర్పాటు చేసిన మైత్రి కాలనీలోని నర్సరీలో 2.40 లక్షలకు పైగా మొక్కలను పెంచారు. మరిన్ని మొక్కలు పెంచేందుకు కవర్లలో మట్టిని పోసి సిద్ధం చేశారు. ఇప్పటి వరకు 50 వేల మొక్కలను పంపిణీ చేశారు.



ఇంటింటికి మొక్కలు పంపిణీ చేస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

అనువైన ప్రాంతాల్లో నర్సరీలు..

మున్సిపల్ కార్పొరేషన్ పరిధి కిస్మత్‌పూర్ మైత్రి కాలనీ ఈసీ వాగు సమీపంలో నీరు ఉండి అనువైన ఎకరం 10 గుంటల ప్రభుత్వ స్థలంలో 2.40 లక్షల మొక్కలను అధికారులు పెంచారు.

నీరు పోసేందుకు ప్రత్యేక చర్యలు..

మైత్రి కాలనీలోని నర్సరీలలో పైప్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేసి, గార్డులతో మొక్కల పర్యవేక్షణ బాధ్యత చేపడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో మొక్కలకు నీరు పోసేందుకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశారు. ప్రతి మొక్క ఎదిగే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. వేసవి కాలంలో మొక్కలు, చెట్లు ఎండిపోకుండా చూసుకుంటున్నారు.

రకాల మొక్కలు..

ఈ నర్సరీలో మందారం, గులాబీ, ఎర్రరోజ్, తెల్ల రోజ్, టెబుల్ రోజ్ ఎల్లో, రెడ్, నూరు వరహాలు వంటి పూలమొక్కలతో పాటు సీతాఫలం, చైనా బాదం , నీడనిచ్చే వేప, కానుగా, కాంగో,కార్పస్‌తోపాటు చింత, జామ నేరేడు, టేకు తదితర మొక్కలను పెంచుతున్నారు.

నాటిన ప్రతి మొక్కనూ సంరక్షిస్తున్నాం..



కార్పొరేషన్ పరిధిలో పచ్చదనం పెంచేందుకు, పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. నాటిన ప్రతి మొక్కనూ సంరక్షిస్తున్నాం. గతంలో నాటిన మొక్కలు పెరిగి పచ్చదనం సంతరించుకున్నాయి. పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి.

– బచ్చలకూరి శరత్‌చంద్ర, కమిషనర్ బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్

హనుమాన్‌నగర్‌వాసుల వివరాలు ఎమ్మెల్సీకి అందజేత



వివరాలను నమోదు చేస్తున్న షేక్ రియాజ్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్‌లోని హనుమాన్‌నగర్ గల ప్రభుత్వ స్థలంలో ఇల్లు నిర్మించుకొని ఉంటున్న 480 మంది వివరాలను గురువారం మజ్లిస్ పార్టీ ఎమ్మెల్సీ రహమత్ బేగ్‌కు అందజేశానని మజ్లిస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు షేక్ రియాజ్ వెల్లడించారు. హనుమాన్‌నగర్‌లో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... గత నాలుగు రోజుల క్రితం శాసనమండలిలో ఎమ్మెల్సీ రహమత్ బేగ్ హనుమాన్‌నగర్ వాసులకు పట్టాలు ఇవ్వాలని మంత్రి కేటీఆర్‌ను కోరారన్నారు. అందుకు స్పందించిన మంత్రి కేటీఆర్ లబ్ధిదారుల వివరాలతో పూర్తి సమాచారాన్ని లిఖితపూర్వకంగా అందించాలని ఎమ్మెల్సీ రహమత్ బేగ్‌కు సూచించారు. దీంతో రెండు రోజులుగా రియాజ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారుల పేర్లను నమోదు చేసి అందజేశామన్నారు. ప్రస్తుతం 480 మంది పేర్లను నమోదు చేశామని, మరికొంత మంది లబ్ధిదారులు ఉన్నారన్నారు. వారి పేర్లను కూడా అందజేస్తామన్నారు. 50 ఏళ్లుగా వీరు ఈ ప్రాంతంలో నివాసముంటున్నా ఎలాంటి పట్టాలు ఇవ్వలేదని, వీరికి కనీస సౌకర్యాలు కూడా లేవని అన్నారు. ఈ విషయాన్ని తాను ఎమ్మెల్సీ రహమత్ బేగ్‌తో పాటు మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ, శాసనసభ పార్టీ నాయకుడు అక్బరుద్దీన్ ఒవైసీ దృష్టికి తీసుకెళ్లడంతో సమస్య ప్రభుత్వానికి చేరిందన్నారు. త్వరలో మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టాలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

పేద విద్యార్థులకు ఉచితంగా బస్సు పాసుల అందజేత



విద్యార్థులకు బస్‌పాసులు అందజేస్తున్న త్రినేత్ర ఫౌండేషన్ చైర్మన్ పరమేశ్వరీనరేందర్

శంషాబాద్: బస్‌పాసు తీసుకోలేని నిరుపేద విద్యార్థులకు త్రినేత్ర ఫౌండేషన్ తన వంతు సహకారాన్ని అందించింది. పట్టణంలోని తొండుపలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటూ దూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్న వారికి బస్‌పాసుల రుసుం చెల్లించి, పాసులను వారికి అందజేశారు. ఈ సందర్భంగా త్రినేత్ర ఫౌండేషన్ చైర్మన్ మడపతి పరమేశ్వరీనరేందర్ మాట్లాడుతూ, సామాజిక సేవ కార్యక్రమాలను ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే కేన్సర్ రోగులకు పోషకాహారం అందించే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామన్నారు. విద్యార్థులకు చేయతనందించేందుకు మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తప్పక తీసుకోవాలి



సామూహిక సీమంతం కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, కౌన్సిలర్ కుమార్

శంషాబాద్: పట్టణంలోని ఆరో వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో స్థానిక కౌన్సిలర్ వై.కుమార్ ఆధ్వర్యంలో మహిళలకు సామూహిక సీమంతం కార్యాక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు పోషకాహారం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారంతో పాటు శిశుసంక్షేమ శాఖ అధికారులు అందించే సూచనలు పాటించాలని అధికారులు తెలిపారు.

తల్లిపాలే శ్రేయస్కరం ...

బిడ్డలకు తల్లిపాలే ఎంతో శ్రేయస్కరమైనవని ఐసీడీసీ సీడీపీ షబానా సూచించారు. పట్టణంలోని ఎయిర్‌పోర్టు కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్సీ న్యూట్రీషన్ విద్యార్థులు పోషకాహారంపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ సుగుణ, జీఎంఆర్ న్యూట్రీషన్ హెల్త్ విభాగం అధికారులు మనోహర్, ఆస్రా, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, బాలమణి పాల్గొన్నారు.

ఆటోలపై రవాణా శాఖ ప్రత్యేక తనిఖీలు



వాహనాలపై కేసులు నమోదు చేస్తున్న ఇన్‌స్పెక్టర్ రాధిక



అధికారులు సీజ్ చేసిన ఆటోలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఆరాంఘర్ చౌరస్తా వద్ద గురువారం ఉదయం రవాణా శాఖ అధికారులు ఆటోలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రాధిక ఆధ్వర్యంలో 30 వాహనాలను సీజ్ చేసి రాజేంద్ర నగర్ ఆర్టీసీ డిపోలోని గ్రౌండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ రాధిక మాట్లాడుతూ... ఇతర జిల్లాల్లో రిజిస్ట్రేషన్ అయిన వాహనాలను నగరంలో అక్రమంగా తిప్పుతున్నారన్నారు. నగరంలో పెరిగిపోతున్న కాలుష్యం, వాహనాల రద్దీ నేపథ్యంలో పదేళ్ల క్రితమే ప్రభుత్వం కొత్త ఆటోలకు అనుమతి ఇవ్వడం లేదన్నారు. కొందరు డ్రైవర్లు ఇతర జిల్లాల్లో రిజిస్ట్రేషన్ అయిన వాహనాలను తీసుకొచ్చి నగరంలో వాడుతున్నారన్నారు. దీంతో పాటు ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ లేకపోవడంతో వాహనాలను సీజ్ చేశామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మద్యం తాగి బస్సు నడిపిన డ్రైవర్‌పై కేసు



సాయికుమార్

మణికొండ: విద్యార్థులను జాగ్రత్తగా ఇంటి నుంచి కళాశాలకు, కళాశాల నుంచి ఇంటికి చేర్చాల్సిన బస్సు డ్రైవర్ మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ నార్సింగి ట్రాఫిక్ పోలీసులకు చిక్కాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శంకర్‌పల్లి మండల పరిధిలోని ఐబీఎస్ కళాశాలకు చెందిన బస్సు(ఏపీ20టీసీ4812) డ్రైవర్ వి.సాయికుమార్ బుధవారం సాయంత్రం మద్యం తాగి బస్సు నడుపుకుంటూ వెళ్తున్నాడు. సబితానగర్ వద్ద డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టిన పోలీసులు సాయికుమార్‌ను ఆపి పరీక్షించగా మద్యం తాగినట్టు తేలింది. దీంతో అతడిపై ట్రాఫిక్ పోలీసులు నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగి డ్రైవింగ్ చేసిన 13 మందికి జైలు శిక్ష

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తాగి డ్రైవింగ్ చేయడంతో పాటు లైసెన్స్ లేకుండా వాహనాలను నడుపుతూ 28 పోలీసులకు చిక్కారు. వీరిపై కేసు నమోదు చేసిన పోలీసులు ఇన్‌స్పెక్టర్ బోస్ ఆధ్వర్యంలో గురువారం ఉప్పర్‌పల్లి కోర్టు న్యాయమూర్తి ముందు హాజరు పరిచారు. 28 మందిలో 13 మందికి న్యాయమూర్తి 2 నుంచి 5 రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఐదుగురికి 5 రోజులు, ఇద్దరికి నాలుగు రోజులు, నలుగురికి నాలుగు రోజులు, ఇద్దరికి రెండు రోజుల పాటు జైలు శిక్ష విధించారు. మిలిగిన వారికి అపరాధ రుసుం విధించారు. వాహనదారులంతా ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని, మద్యం తాగి వాహనాలను నడుపుతూ ప్రాణాలపైకి తెచ్చుకోవద్దని ఇన్‌స్పెక్టర్ బోస్ వాహనదారులకు సూచించారు.

బీజేపీ జెండా దొంగలించారని ఫిర్యాదు



జెండా అపహరణకు గురైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని శివరాంపల్లి రైల్వే స్టేషన్ వద్ద గల భారతీయ జనతా పార్టీ జెండాను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. గురువారం ఉదయం డివిజన్ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రాజు స్వామి ఈ విషయాన్ని గమనించి బీజేపీ నాయకులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న నాయకులు అనంతరం మైలార్‌దేవ్‌పల్లి డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రాజు స్వామి మాట్లాడుతూ... గత 15 ఏళ్లుగా ఈ ప్రాంతంలో జెండా ఏర్పాటు చేసి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పార్టీ ఎదుగుదలను చూసి ఓర్వలేక కొందరు ఈ ఘటనకు పాల్పడి ఉంటారని ఆరోపించారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన వారిలో నాయకులు హీరాలాల్, రాములు ఉన్నారు.

ఆదిత్యనగర్‌లో కాంగ్రెస్ బస్తీ బాట



ఆదిత్యనగర్‌లో స్థానికుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న రఘునాథ్ యాదవ్

హఫీజ్‌పేట్ : మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్య నగర్‌లో గురువారం కాంగ్రెస్ నాయకులు బస్తీబాట నిర్వహించారు. ఈ బస్తీ బాటలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు రఘునాథ్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు పది సంవత్సరాల నుంచి బస్తీలను పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. ముఖ్యంగా తాగునీరు, డ్రైనేజీ, రోడ్డు సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. బీఆర్ఎస్ నాయకులు బస్తీలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారే తప్ప పనులు ప్రారంభించలేదని ఆరోపించారు. స్థానిక కార్పొరేటర్ బస్తీలోని మంచినీటి సమస్యలను గాలికి వదిలేశారన్నారు. హమీద్, రషీద్, హసన్, షరీఫ్, భరత్ యాదవ్, రాజేష్ యాదవ్, కిరణ్‌రెడ్డి, కుమార్ పాల్గొన్నారు.

సమస్యలకు శాశ్వత పరిష్కారం: ఎమ్మెల్యే గాంధీ



రాజీవ్‌నగర్‌లో సమస్యలను ఎమ్మెల్యేకు వివరిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, స్థానికులు

రాయదుర్గం: గోపన్‌పల్లిలోని రాజీవ్‌నగర్ కాలనీలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. త్వరలోనే రాజీవ్‌నగర్‌కాలనీలో యూజీడీ పైప్‌లైన్ పనులను చేపట్టేలా చర్యలు తీసుకుంటామని ఆయన స్థానికులకు హామీ ఇచ్చారు. గురువారం గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి గోపన్‌పల్లి రాజీవ్‌నగర్, సోఫాకాలనీల్లో డ్రైనేజీ ఔట్‌లెట్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఈఈ శ్రీనివాస్, ఏఈ సునీల్, జలమండలి మేనేజర్ అభిషేక్, నాయకులు గణేష్‌ముదిరాజ్, రాజునాయక్, శ్రీనివాస్‌యాదవ్, సురేందర్, వినోద్, శ్రీనివాస్‌నాయక్, మల్లేష్, నర్సింహ్మారాజు, నవాజ్ కాలనీవాసులు పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం

గచ్చిబౌలి: వ్యాయామంతో సీనియర్ సిటిజన్లు ఆరోగ్యంగా ఉంటారని తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టీఎస్ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లో వృద్ధుల వ్యాయామశాలను ఎఫ్‌డీసీ వైస్ చైర్మన్, ఎండి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొటానికల్ గార్డెన్‌ను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌కు ఐకాన్‌గా బొటానికల్ గార్డెన్‌ను తీర్చిదిద్దుతామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్ నాయక్, డైరెక్టర్ ఎం.జె.అక్బర్, అసిస్టెంట్ డైరెక్టర్ స్కైలాబ్, జీఎం రవీందర్ రెడ్డి, ఓఎస్‌డీటీపీ తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీఏఎస్ ఎగ్జిక్యూటివ్ కమిటీలో హెచ్‌సీయూ ప్రొఫెసర్



ప్రొ.ప్రకాశ్‌బాబు

రాయదుర్గం: తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఎగ్జిక్యూటివ్ కమిటీకి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ప్రకాశ్‌బాబు ఎన్నికయ్యారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లోని బయో టెక్నాలజీ, బయో ఇన్ఫర్మేటిక్స్ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు. ఆంధ్రప్రదేశ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (ఏపీఏఎస్) 1963లో ఏర్పాటు చేశారు. అయితే రాష్ట్ర విభజన తర్వాత ఇది కాస్తా తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (టీఏఎస్)గా మార్చడం జరిగింది. ప్రొఫెసర్ ప్రకాశ్‌బాబు పరిశోధనా బృందం న్యూరో క్లినిషియన్‌ల సహకారంతో మెదడు వ్యాధుల ప్రాంతంలో పని చేస్తోంది. న్యూరో డీజెనరేటివ్ వ్యాధులు, సెరిబ్రల్ ఇస్కీమియా(స్ట్రోక్) సెరిబ్రల్ మలేరియా ప్రధాన పరిశోధనలు. ఆయనను పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు అభినందించారు.

ఫిరంగి నాలా ఆక్రమణలపై పురపాలక శాఖ ఆరా

- క్షేత్రస్థాయిలో ఉన్న ఆక్రమణల లెక్కలు తీస్తున్న అధికారులు
- శంషాబాద్ పట్టణంలో 42కు పైగా ఉన్నట్టు గతంలోనే నివేదిక
- తాజాగా మరో పదికిపైగా జరిగినట్లు సమాచారం



ఫిరంగి నాలాకు అడ్డంగా నిర్మిస్తున్న ప్రహరీ

శంషాబాద్: నిజాం హయాంలో సాగునీటి కోసం ఏర్పాటు చేసిన ఫిరంగి నాలా అక్రమ కట్టడాలతో ఉనికిని కోల్పోతోంది. ఈ నేపథ్యంలో ఫిరంగి నాలాపై ఉన్న అక్రమ కట్టడాలు ఎన్ని? ఏయే ప్రాంతాల్లో ఉన్నాయి. గతంలో స్థానిక సంస్థలు వాటికి ఏవైనా అనుమతులు మంజూరు చేశాయా? చేస్తే ఎవరు చేశారు వంటి వివరాలతో నివేదిక సమర్పించాలని పురపాలక శాఖ ఉన్నతాధికారులు ఇటీవల మున్సిపాలిటీ అధికారులను ఆదేశించారు. దీంతో శంషాబాద్ పట్టణంలో ఫిరంగి నాలాపై జరిగిన నిర్మాణాలతో పాటు దాని బఫర్ జోన్‌లో ఉన్న నిర్మాణాల వివరాలను పట్టణ ప్రణాళికా విభాగం సేకరిస్తోంది. శంషాబాద్ పట్టణ పరిధిలో ఇప్పటికే 42 అక్రమ నిర్మాణాలు ఫిరంగి నాలాపై ఉన్నట్లు తేలింది. తాజాగా మరో పదికి పైగా నిర్మాణాలు జరిగి ఉండవచ్చని అంచనా వేస్తున్నారు.

ఎక్కడెక్కడ?

రాళ్లగూడ ప్రధాన రహదారిలో కాల్వపైనే సుమారు 8కి పైగా ఇళ్లు బహుళ అంతస్తులతో నిర్మించారు. మధురానగర్‌లో ఓ జిమ్ ముందు ఉన్న కాల్వను ఓ వ్యక్తి తన భూమిలోకి కలిపేసుకున్నాడు. జాతీయ రహదారికి సమీపంలో కూడా ఫిరంగి నాలా బఫర్‌జోన్ ఆనుకుని ఇటీవలే బహుళ అంతస్తుల నిర్మాణాలు జరిగాయి. మున్సిపాలిటీ అధికారులు చేష్టలుడిగి చూడటం తప్ప అడ్డుకొనేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సాతంరాయిలో ఫిరంగి నాలాను కొందరు రోడ్డుగా మార్చుకోవడంతో పాటు అడ్డంగా ప్రహరీ నిర్మించి గేటు కూడా ఏర్పాటు చేశారు. అక్కడ ఏర్పాటు చేస్తున్న కార్పొరేట్ బహుళ అంతస్తుల మధ్య కూడా ఫిరంగి నాలా కబ్జాకు గురవుతోంది. సదరు నిర్వాహకులు ఇప్పటికే అందులో పైప్‌లైన్లు ఏర్పాటు చేసి రహదారిగా మార్చేశారు.

తాజాగా...

ఓ వైపు అధికారులు ఫిరంగి నాలాపై ఉన్న అక్రమాల లెక్కలు తీస్తుండగా, తాజాగా ఆర్‌కే గార్డెన్ వెనకాల ఉన్న ఫిరంగి నాలాకు అడ్డంగా కొందరు వ్యక్తులు ప్రహరీ నిర్మిస్తున్నారు. ఈ విషయాన్ని స్థానికులు గురువారం ఉదయం రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, అధికారులు అక్కడికి వెళ్లి పనులు నిలిపివేయించారు.